క్లుప్తంగా

వేసవిలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

కె.కోటపాడు : వారాడలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలను మంగళవారం లంకవాని పాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నిర్వహించారు. 127 మందికి వైద్యాధికారి సాయికిరణ్ వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులను అందించారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. వేసవికాలంలో వృద్ధులు, చిన్నారులు వడగాడ్పుల బారిన పడకుండా వైద్య సిబ్బంది వివరించే ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని వైద్యాధికారి సూచించారు. హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ పాల్గొన్నారు.

బోధన సామర్థ్యం పెంచుకోవాలి



శిక్షణ తరగతులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీడీపీవో మేరీ సువార్త

నర్సీపట్నం : బాలల సంరక్షణ, విద్యపై అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన పొందాలని సీడీపీవో మేరీ సువార్త పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో సీడీపీవో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ్ భీ పఢాయి భీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బోధన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అనుసరించాల్సిన పద్ధతులపై ప్రాథమిక అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మురుగుపాలెంలో సిద్ధి వినాయక తీర్థం



సిద్ధి వినాయకస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కె.కోటపాడు : మండలంలో గొండుపాలెం శివారు మురుగుపాలెం గ్రామస్తులు సిద్ధి వినాయకుని తీర్థం మంగళవారం ఘనంగా జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిపారు. తీర్థం సందర్భంగా రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆలయానికి వెండి దీపపు కుందెల బహూకరణ



మోదమాంబ ఆలయంలో వెండి దీపపు కుందెలు అందిస్తున్న దాతలు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు మోదమాంబ ఆలయానికి వెండి కుందెలు దాతలు బహూకరించారు. పాడేరు మండలం గుత్తులపుట్టు గ్రామానికి చెందిన డొనూరు కోటేశ్వరరావు, సత్యవతి దంపతులు, వారి కుమారుడు గణేష్, లాస్య దంపతుల ఆర్థిక సహకారంతో 300 గ్రాముల వెండి దీపపు కుందెలను సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు మంగళవారం అందజేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు

చోడవరం : మూడు ప్రధాన రహదారులకు జంక్షన్‌గా మెయిన్‌రోడ్డుపై ఉన్న వెంకన్నపాలెం కూడలి వద్ద నిఘా కెమెరాలు ఏర్పాటు చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. చోడవరం సీఐ అప్పలరాజు ఈ జంక్షన్‌లో ఏఏ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పెట్టాలనే అంశంపై మంగళవారం పరిశీలించారు. చోడవరం–అనకాపల్లి–విశాఖపట్నం ప్రధాన రహదారిపై ప్రధాన కూడలిగా వెంకన్నపాలెం జంక్షన్ ఉంది. పరిసర గ్రామాలకు కూడా ఈ జంక్షనే వాహనాలు, ప్రజలు రాకపోకలకు కేంద్రంగా ఉంది. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని సీఐ తెలిపారు. ఆయనతోపాటు సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, జగదీష్ ఉన్నారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 20 మంది ఎంపిక



శస్త్ర చికిత్సకు తరలిస్తున్న రోగులు

ఎస్.రాయవరం: శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్వసిద్ధి పీహెచ్‌సీలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 65 మంది రోగులకు ఆప్తాలమిస్టు బొండా వెంకటరావు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 20 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు.



పెంకులూడి జీర్ణావస్థలో ఉన్న గుడి



కూలేందుకు సిద్ధంగా దర్శనమిస్తున్న ఆలయం పైకప్పు

నూకాలమ్మా... మన్నించమ్మా!

మండలంలోని పది గ్రామాల ప్రజలు ఆరాధ్య దైవంగా పూజించే మర్రిపాలెం నూకాలమ్మ తల్లి ఆలయం నిర్లక్ష్యం నీడలో శిథిలావస్థకు చేరింది. అమ్మవారి విగ్రహం రంగులు వేయకుండా ఆలంకరణ చేయకుండా దర్శనమిస్తుంది. వేలాది రూపాయల ఫలసాయం వచ్చే మడిమాన్యాలున్నా అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా కొత్త అమావాస్య పండగ సమీపిస్తున్నా అమ్మవారికి ఉత్సవ శోభ కరువైంది.

- జీర్ణావస్థలో మర్రిపాలెం నూకాలమ్మ తల్లి ఆలయం
- పది గ్రామాల ఇలవేల్పునకు కానరాని అలంకరణ
- మడిమన్యాలున్నా అభివృద్ధికి నోచుకోని వైనం
- ఫలసాయం ద్వారా ఏటా ఆదాయం
- కొత్త అమావాస్య సమీపిస్తున్నా కానరాని పండుగ వైభవం



గర్భగుడిలో నిరుపయోగంగా ఉన్న గరగలు



పండగ పురస్కరించుకుని గుడి ముందు వేసిన పందిరి



రంగులు వేయకుండా పాత దుస్తులతో ఉన్న నూకాలమ్మ తల్లి విగ్రహం

నాతవరం : మండలంలోని యల్లవరం దొండపేట రెవెన్యూ పరిధిలో నూకాలమ్మ తల్లి ఆలయం ఉంది. మర్రిపాలెం, డి.యర్రవరం పంచాయతీలకు చెందిన వెన్నలపాలెం, మోకాంగులపాలెం, కొత్త ఎల్లవరం, మాదంపూడి, బాపన్నపేట, సిద్ధిపట్నం, పొట్టిపాలెం, యరకంపేట, తాండవ జంక్షన్, డి.యర్రవరం జంక్షన్, రెల్లికాలనీకి చెందిన ప్రజలకు ఆరాధ్య దైవం ఈ అమ్మవారు. అమ్మవారి పేరిట జీడిమామిడి తోటలు, పంట పొలాలు భూములు మాన్యం ఉన్నాయి.

ఏటా రూ.లక్ష ఫలసాయం : ఇదే రెవెన్యూ పరిధిలో సుమారుగా 5 ఎకరాలు 30 సెంట్లు జీడి మామిడి తోటలు, మర్రిపాలెం పంచాయతీలో వెర్రిగెడ్డ ఆనకట్టు పెద్ద చెరువు ఆయకట్టు పరిధిలో రెండు ఎకరాల పంటపొలం ఉంది. ఈ భూముల విలువ మార్కెట్ రేటు ప్రకారం రూ.3 కోట్ల పైమాటే. ప్రతి ఏటా జీడిమామిడి తోట పంట పొలం ఫలసాయం నిమిత్తం దేవదాయ ధర్మదాయశాఖాధికారులు, స్థానిక గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బహిరంగం వేలం పాట నిర్వహిస్తుంటారు. ఏడాదికి ఆయా భూముల ఫలసాయం నిమిత్తం రూ.లక్షకు పైగా ఆదాయం వస్తుంది. ఇంత ఆదాయం అమ్మవారి పేరిట వస్తున్నా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా పండగ పూట సైతం అమ్మవారి ఆలయం కనీస అలంకరణకు నోచుకోలేదు.

కూలేందుకు సిద్ధంగా...

అమ్మవారి ఆలయం గోపురం ఇటుకుల పెంకులు ఉడిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. కొత్త అమావాస్య పండగకు అమ్మవారి ఇలవేల్పుగా ఉండే గ్రామాల్లో పది గ్రామాల్లో వారం రోజుల ముందు నుంచి గరగలు ఊరేగిస్తుంటారు. ఆ గరగలు సైతం సరైన నిర్వహణ లేక గర్భగుడిలో శిథిలావస్థలో కన్పిస్తున్నాయి. ప్రతి ఏటా అమ్మవారి పండగ సందర్భంగా ఉత్సవాల పేరుతో దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు వేలాది రూపాయలు ఖర్చు చేసినట్టు రికార్డుల్లో చూపిస్తుంటారు. ఈనెల 28, 29 తేదీలలో అమ్మవారి పండగ సందర్భగా భ భక్తులు అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో వస్తుంటారు. ప్రస్తుతం ఆలయ ప్రాంగణంలో కొబ్బరి కొమ్మలతో తాత్కాలికంగా పందిరి ఏర్పాటు చేశారు. అమ్మవారికి పండగ పూట అయినా సరే దీప ధూప నైవేద్యాలతో ఉత్సవాలు ఘనంగా చేయాలని, భక్తులకు సరైన ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫేర్‌వెల్ డే



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు

నర్సీపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు మాట్లాడుతూ 1985లో కళాశాల స్థాపించారని, నర్సీపట్నం పరిసర ప్రాంత గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యను, ఉద్యోగాలను కల్పించడంలో కళాశాలకు నాలుగు దశాబ్దాల చరిత్ర ఉందని కొనియాడారు. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి కళాశాల వార్షిక మేగజైన్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ ఆవిష్కరించారు. కళాశాలలో మౌలిక సదుపాయాలు, అందుబాటులో ఉన్న కోర్సులు, ఉన్నత విద్య ద్వారా ఉద్యోగ అవకాశాలు గురించి వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ వివరించారు. వీడ్కోలు వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

మాడుగుల రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజా వేదిక మాడుగుల ఎంపీపీ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ కె. అప్పారావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 4 వ తేదీ నుంచి 20 తేదీ వరకు గ్రామాల్లో గతంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ అనంతరం జరిగే ఈ ప్రజావేదికకు ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

మెరుగైన ఆహారపు అలవాట్లతో రోగాలు దూరం



కళాజాత ద్వారా అవగాహన కల్పిస్తున్న సభ్యులు

నాతవరం : ప్రజలకు శారీరక శ్రమ లేకపోవడం, సరైన ఆహారపు అలవాట్లు పాటించకపోవడం వల్ల అనేక రోగాలు వ్యాపిస్తున్నాయని హృదయ స్వచ్ఛంద సంస్థ రిసెర్చ్ అసిస్టెంట్ కె.రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సేవా సంస్థతో పాటు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో కాలానుగుణంగా వస్తున్న వ్యాధుల పట్ల కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అధికంగా మధుమేహం, అధిక రక్తపోటు వ్యాధులు వస్తున్నాయని, వాటిని అదుపు చేయకపోవడం వల్ల క్యాన్సర్, కిడ్నీ, గుండె జబ్బులకు దారి తీస్తున్నాయని తెలిపారు. ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాతలో వివరించారు. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు శెట్టి గోపి, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైనుకు మరమ్మతులు



రోలుగుంట శివాలయం రోడ్డులో పైపులైను దెబ్బతిని రోడ్డుపై ఏరులా పారుతున్న సాగునీరు (ఫైల్)



దెబ్బతిన్న పైపులైను పనులు చేపట్టిన సిబ్బంది

రోలుగుంట : మండలకేంద్రంలో దెబ్బతిన్న పైపులైనుకు మరమ్మతులు చేపట్టారు. శివాలయం సమీపంలో రోడ్డు పక్కనున్న పైపులైను దెబ్బతిని అక్కడ నుంచి గ్రంథాలయం రోడ్డు వరకూ పైపులైను లీకేజీ అయి నీరు వృథా అవుతున్న వైనంపై 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 23న అసలే వేసవి కాలం...ఏమిటీ అలసత్వం! శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే మరమ్మతులు చేపట్టారు. దెబ్బతిన్న పైపులైను వద్ద గోతులు తీసి పైపులైను మార్చి సరి చేశారు. లీకేజీని అరికట్టారు. దీంతో ప్రభావిత గ్రామాల వారు హర్షం వ్యక్తం చేస్తూ సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయిని పూజలు



కాత్యాయిని పూజల్లో పాల్గొన్న భక్తులు



అమ్మవారికి అలంకరణ చేస్తున్న వేదపండితులు మూర్తి

నాతవరం : మర్రిపాలెం పంచాయతీ శివారు సిద్ధిపట్నం గ్రామంలో వెలసియున్న దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు శ్రీమూర్తి శర్మ, శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో దుర్గా మల్లేశ్వరస్వామి, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో కాత్యాయిని పూజలు నిర్వహించారు. భక్తులందరికీ ఉచితంగా తీర్థ ప్రసాదాలు అందించారు.

దేవరాపల్లిలో మోస్తరు వర్షం

దేవరాపల్లి : దేవరాపల్లి మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేయగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మేఘాలు కమ్మేసి ఉరుములు, మెరుపులతో హడావిడి చేయడంతో భారీ వర్షం కురుస్తుందని ప్రజలంతా ఆశించారు. అయితే మోస్తరు వర్షం కురిసింది. చల్లని వాతావరణాన్ని ప్రజలు ఆస్వాదించారు.

ఘనంగా గ్రామదేవతల పండగలు



గవర్ల అనకాపల్లిలో ఘటాల ఊరేగింపులో భక్తులు

మునగపాక: మండలంలో గవర్ల అనకాపల్లి, నారాయుడుపాలెం, మునగపాక గ్రామాల్లో మంగళవారం పరదేశమ్మ తల్లి పండగలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ఆయా ప్రాంతాల్లోని అమ్మవార్లను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు. గవర్ల అనకాపల్లిలో ఘటాల ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు జరిగింది. మునగపాకలో పరదేశమ్మ తల్లిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు తదితరులు దర్శించుకొని పూజలు చేశారు. ఈ పండగను సర్పంచ్ అప్పారావు స్థానికంగా ఊయల ఊగి ప్రారంభించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ ఆధ్వర్యంలో పండగను ఘనంగా నిర్వహించారు.

జీడిపంటకు మద్దతు ధర కల్పించాలి



రావికమతం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నిరసన

రావికమతం : జీడిపిక్కలకు మద్దతు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు,గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాంగి చంద్రయ్య డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం జీడి రైతులు చేపట్టిన నిరసనలో వారు మాట్లాడారు. జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు మంజూరు చేయాలని కోరారు. బాదంపాడు రెవిన్యూ పరిధిలో సర్వే నెంబరు 41లో 5–82సెంట్ల ప్రభుత్వ భూమిలో శరణ్ గ్రూప్ ఆక్రమించిందని, ఈ భూమిలో గిరిజనులకు ఇళ్ల పట్టాలు ఇచ్చి శాశ్వత భవనాలు కట్టించాలని, నాన్ షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజన భూములను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్నారని, వాటిని తిరిగి గిరిజనులకు అప్పగించాలని కోరారు. తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీవీటీసీ సంఘం నాయకుడు వాసు, ఆదివాసీ గిరిజన మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంట



బుచ్చెయ్యపేటలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

బుచ్చెయ్యపేట : ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటల వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం బుచ్చెయ్యపేటలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో పండించిన పలు రకాల కూరగాయలు, ఆకు కూరల ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం పెరిగేలా రైతులను చైతన్య పరచాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఆరోగ్యకరమైన పంట దిగుబడి వస్తుందన్నారు. ఇళ్ల వద్ద ఖాళీ ప్రదేశాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయలు సాగు చే సి మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని అవగాహన కల్పించారు. ఏపీఎం రాజునాయుడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అమరపిన్ని వరలక్ష్మి, పూర్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కేసులు



ఆక్రమణకు గురైన గెడ్డ భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మాకవరపాలెం : ప్రభుత్వ భూములు ఆక్రమించే వారిపై కేసులు తప్పవని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎల్.రామారావు స్పష్టం చేశారు. మండలంలోని తామరం రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 61/3లో ఉన్న ప్రభుత్వ గెడ్డ భూమి ఆక్రమణకు గురైనట్టు మంగళవారం ఆర్ఐ జెట్టి, తామరం వీఆర్వో శాంతకుమారి గుర్తించారన్నారు. ఈ భూమిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే రెవెన్యూలోని సర్వే నంబర్ 54 లో కూడా కొందరు గెడ్డ భూమిని ఆక్రమించి గట్లు వేసినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు

తాగునీటి బోరు ఏర్పాటు



వడ్డాదిలో రిగ్‌బోరు పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ

బుచ్చెయ్యపేట : వడ్డాది పల్లెవీధిలో తాగునీటి సమస్య తీరింది. వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి తన ఎంపీటీసీ నిధుల నుంచి లక్ష రూపాయలతో మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. మంగళవారం రిగ్ బోర్ పనులు ప్రారంభించారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దన రావు, వడ్డాది టౌన్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, ఎంపీటీసీ కె.రమణ, వార్డు మెంబర్లు గుమ్మిడి ప్రసాద్, వెలుగుల అయ్యన్నదొర నాయకులు సయ్యపురెడ్డి కొండబాబు, రాజా, దొరబాబు పాల్గొన్నారు.

జోరుగా షాదీఖానా మరమ్మతులు



మాడుగులలో మరమ్మతులు చేపడుతున్న షాదీఖానా

మాడుగుల : స్థానిక షాదీఖానా మండల పరిషత్ నిధులతో మరమ్మతులు జోరుగా సాగుతున్నాయి. గత 50 ఏళ్ల కిందట నిర్మాణం చేపట్టిన షాదీఖానా మందిరం శిథిలావస్థకు చేరడంతో కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీషా మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో షాదీఖానాకు మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో మండలంలో గల ముస్లిం సోదరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పన్ను చెల్లింపుదారులకు రాయితీ



మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర

నర్సీపట్నం : ఆస్తి పన్ను బకాయిదారులకు 50 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకూ పెండింగ్‌లో పన్ను బకాయిలకు వడ్డీ రాయితీ కల్పించడం జరిగిందన్నారు. ఇంటి పన్నులు, ఖాళీ స్థలాలపై పన్ను బకాయిదారుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం వెసులబాటు కల్పిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నెలాఖరులోపు పన్ను బకాయిలను మొత్తం చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. 2024–25లో వడ్డీతో కట్టిన వారికి కూడా కట్టిన మొత్తం వడ్డీలో 50 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తామన్నారు. వడ్డీ రాయితీ నగదు రూపంలో కాకుండా రాబోయే సంవత్సరానికి అదే ఇంటి పన్ను బకాయిలకు సర్దుబాటు చేస్తామన్నారు. పురపాలక ప్రధాన కార్యాలయంలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటలకు ప్రత్యేక క్యాష్ కౌంటర్‌లో చెల్లించవచ్చన్నారు. పన్నులను నేరుగా కానీ ఆన్‌లైన్, దగ్గరలో ఉన్న సచివాలయాల్లో కూడా చెల్లించవచ్చన్నారు. ఆదివారం, ఉగాది, రంజాన్ పండగ రోజుల్లో కూడా పన్నులు చెల్లించవచ్చన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాలపై నిర్లక్ష్యం వద్దు



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీవో శిరీషారాణి, ఇతర అధికారులు



చౌడువాడలో శిక్షణ కార్యక్రమంలో ఈవోఆర్డీ రమణి, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు

మాకవరపాలెం : చెత్త సంపద కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దని డీపీవో శిరీషారాణి ఆదేశించారు. మండలంలోని తామరం చెత్త సంపద కేంద్రం వద్ద నియోజకవర్గంలోని నాలుగు మండలాల గ్రీన్ అంబాసిడర్లకు మంగళవారం నుంచి శిక్షణ ఏర్పాటు చేశారు. మొదటి రోజు గొలుగొండ మండలం గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో పాల్గొన్న డీపీవో మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పంచాయతీల నుంచి పంపిణీ చేసే బుట్టల్లోనే చెత్తను వేయాలని, తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని అవగాహన కల్పించారు. బుధవారం నాతవరం, గురువారం నర్సీపట్నం, శుక్రవారం మాకవరపాలెం మండలాల గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ ఇస్తామన్నారు. చెత్త సంపద కేంద్రాలను బాధ్యతగా నిర్వహిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డీఎల్పీవో మూర్తి, సంపద కేంద్రాల జిల్లా కో ఆర్డినేటర్ నాగలక్ష్మి, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, కార్యదర్శి బాలదొర పాల్గొన్నారు.

కె.కోటపాడు : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల సమర్థ నిర్వహణ ద్వారా పారిశుధ్యం మెరుగుపడుతుందని పంచాయతీ విస్తరణ అధికారి రమణి అన్నారు. చౌడువాడ గ్రామంలో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మాడుగుల మండలంలో గల అన్ని పంచాయతీల కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది, క్లాప్‌మిత్రలకు మంగళవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరు చేయాలని, తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయాలన్నారు. దీనిని రైతులకు తక్కువ ధరకే పంచాయతీల ద్వారా విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు పాల్గొన్నారు.